
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 8 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత
గరిష్ఠం 40.1
కనిష్ఠం 19.9



అరుణమ్మ ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

» డీఆర్వో సంగీత



ఫిర్యాదును పరిశీలిస్తున్న డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని డీఆర్వో సంగీత అన్నారు. సోమవారం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదులు రాగా అందులో రెవెన్యూశాఖ నుంచి 21, ఇతర శాఖల నుంచి 35 ఫిర్యాదులు వచ్చాయి.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మన చేతుల్లోనే మన ఆరోగ్యం

» డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 07 (ఆంధ్రజ్యోతి): అన్నింటికన్నా ఆరోగ్యమే ముఖ్యమని, మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి నుంచి ఫరూఖ్‌నగర్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ, ప్లకార్డులను ప్రదర్శించారు. మానవ ఆరోగ్య హక్కులను కాపాడుకోవడానికి 1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటైందని అప్పటి నుంచి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. వాతావరణ కాలుష్యం, కల్తీ ఆహార పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఇంటిలో వండిన ఆహార పదార్థాలనే తినాలన్నారు. విధిగా నిత్యం నడక, వ్యాయమం చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే అనుకున్నది సాధిస్తామన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ ర్యాలీలో వైద్యాధికారులు డాక్టర్ జగదీష్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ముస్తకిన్ అహ్మద్, హెల్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



గ్యాస్ ధర పెంపు దారుణం

వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం పేదలపై భారం మోపడమే. ప్రభుత్వాలు ఒక వైపు రాయితీ ఇస్తున్నామని చెబుతూనే, మరోవైపు ధరలను పెంచడం దారుణం. వంటగ్యాస్ నేడు నిత్యావసర వస్తువు. ధర పెంపుతో పేద, మధ్య తరగతి వర్గాలపై మరింత భారం పడుతుంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధర పెంపుపై పునరాలోచించాలి.

- కె.సదాలక్ష్మి, గృహిణి, పరిగి



ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు (జిల్లాల వారీగా లక్షల్లో)

రంగారెడ్డి	14.93
మేడ్చల్	13.71
వికారాబాద్	2.65

రోజుకు భారం..

రూ.అరకోటి!

గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు

ముందస్తు సంకేతాలు లేకుండానే కేంద్ర ప్రభుత్వం వంటింటిపై భారం మోపింది. దేశ వ్యాప్తంగా ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.50 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు నేటి (మంగళవారం) నుంచి అమలులోకి రానున్నాయి. గృహ అవసరాలతో పాటు వాణిజ్య అవసరాలకు సంబంధించిన అన్ని గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో సామాన్యులపై భారం పడింది. అంతేకాక ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద తీసుకునే సిలిండర్లకు కూడా పెరిగిన ధరలు వర్తిస్తాయని ప్రకటించింది. పెరిగిన ఎల్‌పీజీ ధరలతో ఉమ్మడి జిల్లా వాసులపై రోజూ రూ.అరకోటికిపైగా భారం పడనుంది.

- వంటింటిపై భారం మోపిన కేంద్రం
- 'ఉజ్వల' కనెక్షన్లకు సైతం వర్తింపు
- ఉమ్మడి జిల్లాలో నెలకు రూ. 15 కోట్లు అదనం
- ఆందోళనలో వినియోగదారులు
- ప్రస్తుతం డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 855
- ఎల్‌పీజీ కనెక్షన్లు మొత్తం 31.29 లక్షలు

ఆయిల్ కంపెనీల వారీగా కనెక్షన్లు (లక్షల్లో)

జిల్లా	ఐవోసీఎల్	హెచ్‌పీసీఎల్	బీపీసీఎల్	మొత్తం
రంగారెడ్డి	7.21	5.30	2.42	14.93
మేడ్చల్	5.62	5.30	2.79	13.71
వికారాబాద్	1.26	0.94	0.45	2.65



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ల ధర పెంపుతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గృహావసరాలకు వినియోగించే 14.2 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.855 ఉండగా రూ.50 పెంపుతో ఇక రూ.905లు కానుంది. అన్ని రకాల పన్నులు కలిపితే సిలిండర్ ధర రూ.910ల దాకా అయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్‌కు సుదూరంలో ఉండే ప్రాంతాల్లో ధరలో

మిగతా 7వ పేజీలో...

సన్నబియ్యం

పేదలకు వరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ/షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేదోడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, సన్నబియ్యం పేదలకు వరం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో సన్నబియ్యం లబ్ధిదారు అరుణమ్మ ఇంట్లో ఆమె కుటుంబీకులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీలు అందుతున్నాయా? అని అడిగారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఆదుకుంటోందని మహిళలు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమతి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్టలో నూతన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. మహల్ ఎలికట్ట వాసులు రేషన్ కోసం ఎలికట్టకు వెళ్లేవారని, వారి కోసం గ్రామానికి రేషన్ షాపును మంజూరు చేశామన్నారు. తహసీల్దార్ పార్థసారధి ఉన్నారు.

టీజీఐఐసీ భూములకు

కంచె!

- పూర్తి పరిహారమిచ్చి తీసుకోవాలంటున్న రైతులు
- ఇంటి స్థలం ఇవ్వలేదంటున్న నిర్వాసితులు

7

ఫ్యూచర్‌లో మహేశ్వరం!

మండలాన్ని ఫోర్త్ సిటీలో కలుపుతారా..?

- ప్రత్యేక అథారిటీ ప్రకటనతో టెన్షన్
- మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తారా..?
- పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా..?
- ఎటూ తేల్చుకోలేకపోతున్న నాయకులు, ప్రజలు

మహేశ్వరం మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే ఫ్యూచర్‌సిటీలో కలుపుతారా? మున్సిపాలిటీగా ఏర్పడుతుందా, లేక పంచాయతీ ఎన్నికలు ఉంటాయా? అనేది ఎటూ తేల్చుకోలేక ఇటు ప్రజలు, అటు నాయకులు భవిష్యత్తుపై అయోమయంలో ఉన్నారు. ఇదే సమయంలో పలు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు జట్టుగా ఏర్పడి మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని పోరు బాట పట్టారు. అలాగే మరికొంత మంది నేతలు పంచాయతీ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు.



మహేశ్వరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీతో మహేశ్వం మండల ప్రజలు, నాయకులు ఆయోమయానికి గురవుతున్నారు. మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలుపుతారా, ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తారా, పాత పద్ధతిలోనే పంచాయతీ ఎన్నికలు నర్వహిస్తారా? సమాధానాలు దొరకని సందేహాలతో సతమతమవుతున్నారు. కొందరు మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలని, మరికొందరు సర్పంచ్, ఎంపీటీసీల పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఫ్యూచర్ సిటీలో మండలానికి చెందిన తుమ్మలూరు, మోహబ్బత్‌నగర్ గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీంతో మహేశ్వరం ఫ్యూచర్‌సిటీ జేఏసీ నాయకులు మండలంలోని మరో 28 గ్రామ పంచాయితీలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, మహేశ్వరం

మిగతా 8వ పేజీలో...

దేశంలో నిర్మాణ రంగం

కీలకమైంది

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి

చేవెళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో నిర్మాణ రంగం కీలకమైందని, ఈ రంగంలో 10కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాలుగో మహాసభల పోస్టర్‌ను సోమవారం చేవెళ్లలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేళ్లుగా సంక్షేమ బోర్డుకు పాలకవర్గాన్ని నియమించలేదని, కార్మిక శాఖ ఆధికారులతోనే నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది నిర్మాణరంగ కార్మికుల్ని బోర్డులో సభ్యులుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శంషాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, అధ్యక్షుడు శివ, శ్రీను, రాంచందర్, మంజుల, కార్మికులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు



యాచారం మండలం కుర్మిద్దలో నీరు లేక వెలవెలబోతున్న నీటి తొట్టి

- తాగు నీటికి మూగజీవాలకు తప్పని తిప్పలు
- కొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు..
- చాలా గ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు

యాచారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవాల దాహం తీర్చడానికి గత ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్లను నిర్మించింది. వాటిల్లో నీటిని నింపకపోవడంతో పశువులు దాహంతో అలమటిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్వహణ కొరవడి శిథిలావస్థకు చేరుకున్నాయి. యాచారం మండలంలోని 24 గ్రామపంచాయతీలలో 91 నీటి తొట్లను నిర్మించారు. ఇందులో ఉపాధిహామీ పథకం కింద 48, పంచాయతీ నిధులతో 43 తొట్లు నిర్మించారు. యాచారం, కుర్మిద్ద, మేడిపల్లి, ధర్మన్నగూడ, చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, గున్‌గల్, గడ్డమల్లాయాగూడ. చింతపట్ల, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ గ్రామాలలో నీటి తొట్లు శిథిలమయ్యాయి. వాటికి మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. కుర్మిద్దలో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న నీటి తొట్టి శిథిలమవడంతో దానిని పూర్తిగా కూల్చేశారు. దాని స్థానంలో కొత్త తొట్టిని ఇప్పటివరకు నిర్మించలేదు. నీటి తొట్లలో నీరు లేక రైతులు పశువుల దాహం తీర్చడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నతూండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు తొట్టిని కూల్చారు. నజ్దిక్ సింగారంలో ఉన్న రెండు నీటి తొట్లు పాడయ్యాయి. యాచారం మండల కేంద్రంలో నీటి తొట్టిలో నీరు పెట్టడం లేదని రైతులు వాపోయారు. అయ్యవారిగూడలో నీటి తొట్టి నిర్మించాలని రైతులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు గ్రామాల్లో ఉన్న నీటి తొట్లలో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, పక్కన ఎమ్మెల్యే కసిరెడ్డి

దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా బీజేపీ కుట్ర

» పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి

ఆమనగల్లు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): దేశంలో అసమానతలను రూపుమాపి సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ కృషి చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు సాగిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ వెన్నెల ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాలరాసే బీజేపీ కుట్రలను ప్రజలంతా ఎండగట్టాలన్నారు. రవీంద్ర భారతిలో సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో జైబాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహణ కోసం మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, గాంధీజీ, అంబేడ్కర్ ఆలోచనా విధానాలను, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. విపక్షాల విష ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎ రేవంత్ రెడ్డి నిర్ణయాలు పేదల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఉన్నాయని, వాటిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు భూపతి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సంజీవ్ యాదవ్, ఆనంద్‌కుమార్, రాములు యాదవ్, పర్వత్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.



ట్యాంకర్లతో తెచ్చి.. దప్పిక తీర్చి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు దంచి కొడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పాతాళంలోకి వెళ్లిపోతున్నాయి. లోవోల్టేజీ సమస్య ఇబ్బంది పెడుతోంది. దీంతో అటు పంటలకు, ఇటు పశువులకు సాగు, తాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ మండలంలో బోర్లు పోయకపోవడంతో మూగజీవాల దూప తీర్చేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా తొట్లల్లో నీళ్లు నింపి బతికించుకుంటున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మేలో ఇకెలా ఉంటుందోనని రైతు ఎర్రగారి రాజు ఆందోళన చెందుతున్నాడు.

నందిగామ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి)

ఉమ్రా యాత్రకు ముస్లింలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు 50 మంది ముస్లింలు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన వారికి కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఈ గ్రూపులో ఉన్నారు. ఇందులో రెండోసారి ఉమ్రా చేసేవారు కూడా ఉన్నారు. ఉమ్రా యాత్ర చేయాలంటే భగవంతుడి కృప ఉండాలని ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హఫీజ్ మొహ్మద్ ఫయాజ్ అలీ అన్నారు. యాత్రికులకు ప్రత్యేక ఐడీ కార్డులు, బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా యాత్రికులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యాత్రికులు

గేటు దిమ్మె కూలి బాలిక మృతి



దీక్షిత(ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో ప్రమాదవశాత్తు ఇంటి గేటు దిమ్మెకూలి బాలిక మృత్యువాత పడగా ఆమె తమ్ముడు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎలిమినేడుకు చెందిన బజారు భిక్షపతి-బాలమణిల కూతురు దీక్షిత(10), కుమారుడు శివసాయి ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుతుండగా ఇంటి గేటు దిమ్మె కూలి అక్కాతమ్ముడు తీవ్రంగా గాయపడ్డారు. దీక్షితను నగరంలోని ఓ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. శివసాయి కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. దీక్షిత గ్రామంలోని పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. బాలిక మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్ల చౌరస్తా, బండవెల్కిచర్ల, బొంరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ పాలక విధానాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సరైన న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఆర్ఎస్ఎస్ ఆలోచన విధానంతో రాజ్యాంగంలోని హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యమ్మ, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

మైసిగండిలో ముగిసిన నవమి బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు, భక్తులు

కడ్తాల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిత్యపూజలు, భక్తులతో బాసిల్లుతున్న కడ్తాల మండలం మైసిగండి రామాలయంలో శ్రీ కోదండ రామచంద్రస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడురోజులు ఉత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. జిల్లా నలుమూలల నుంచే కాక సమీప జిల్లాల భక్తులు తరలొచ్చారు. ఉత్సవాల ముగింపులో భాగంగా పూర్ణాహుతి, పల్లకిసేవ, చక్రతీర్థం, పుష్కరస్నాన కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకిలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పూర్ణాహుతితో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోళి పంతూ బ్రహ్మోత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, తహసీల్దార్ ఆర్.పి.జ్యోతి, నాయకులు తులసీరామ్, శేఖర్‌గౌడ్, పాండునాయక్, జవహర్‌లాల్, హీరానాయక్, అరుణ్, యాదగిరి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం



కేశంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):లింగంధనలో సీతారాముల రథోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షణ నిర్వహించారు. 60సంవత్సరాలుగా గ్రామంలో సీతారాములు కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, సుదర్శన్‌గుప్తా, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నాగిళ్ల వెంకటేశ్, ఎన్.భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కందుకూరులో ఘనంగా రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

కందుకూరు: శ్రీరామ నవమిని పురస్కరించుకొని సోమవారం కందుకూరులో రథోత్సవం జరుపుకున్నారు. గ్రామంలో మూడు రోజుల పాటు స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. గుండ్ర శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో శివాలయ ఆవరణలో రథాన్ని అలంకరించారు. మాజీ ఎంపీటీసీ ఎస్.రాశేఖర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్ రథాన్ని ప్రారంభించగా వందలాది మంది భక్తులు రథాన్ని లాగారు. అలాగే మీర్కాన్‌పేటలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఈ నెల 5 నుంచి 8వ తేదీ కొనసాగుతున్నాయి. సోమవారం వేకువజామున శ్రీరాముడి పట్టాభిషేకం జరిపించారు. మంగళవారం తెల్లవారు జామున రథపూజ, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు.

'మా భూమి యాత్ర'ను జయప్రదం చేయండి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధనకు ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశాదన్ ఈ నెల 14 నుంచి చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తులసిగారి రవీందర్ కోరారు. బీ.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ యాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో రథయాత్ర కరపత్రాన్ని విడుదల చేశారు. ఆదిలాబాద్ డైట్ కాలేజీ గ్రౌండ్ నుంచి ఈ యాత్ర మొదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు నాగార్జున, శేఖర్, ప్రదీప్, ఆనంద్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఇసుక దందాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట ఇతర ప్రాంతాల్లో డంప్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు లక్ష్మణ్‌తోప్య, సుభాష్, ముస్తఫా, అనంతయ్య, రత్నం, మల్లప్ప, బాలప్ప, తుల్జానాయక్ పాల్గొన్నారు.

తవ్వేసిన రోడ్డుపై ప్రయాణమెలా?

చౌదరిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బాబోయ్ ఇదేం బాట అని తంగెళ్లపల్లి వాసులు బెంబేలెత్తుతున్నారు. ఎక్కడికక్కడ తవ్వేసిన రోడ్డుపై ప్రయాణించేందుకు భయపడుతున్నారు. సోమవారం కొందుర్గు నుంచి తంగెళ్లపల్లి వెళ్తున్న ట్రాక్టర్ బురదలో కూరుకుపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణ పనుల చేపడుతుండడంతో రోడ్డుకు పక్క నుంచి వేసిన మట్టి బురదమయమైంది. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు ఎప్పుడు బురదలో పడిపోతామోనని బయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మట్టిలో కూరుకుపోయిన ట్రాక్టర్‌ను లాగుతున్న మరో ట్రాక్టర్


టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

'క్రిడ'లో కార్మికుడి మృతి

యాచారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్‌గల్ కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం(సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్)లో సోమవారం మధ్యాహ్నం కార్మికుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు, కార్మికులు ఆందోళన చేశారు. కార్మికులు తెలిపిన వివరాల మేరకు.. పరిశోధన కేంద్రంలో గున్‌గల్‌కు చెందిన జహంగీర్ చాలా కాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తుండగా కిందపడిపోయాడు. తోటి కార్మికులు పరిశోధన కేంద్ర సాంకేతికాధికారి శ్రీకాంత్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే బాధితుడిని యాచారం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇబ్రహీంపట్నం తరలిస్తుండగా మరణించాడు. జహంగీర్ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సాగర్-హైదరాబాద్ రహదారి పక్కన ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మయ్య, చందూ నాయక్, రాములు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

చేవెళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ భూపాల్‌శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్లకు చెందిన కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన 'నేస్తం' చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఎండలో తిరిగేవారి దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, నాయకులు మాణిక్యం, నర్సింలు, కమల్‌రెడ్డి, సత్యం ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

ఆమనగల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధికి పని చేసే వారికి ఏ కష్టమొచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. కర్కల్‌పహాడ్‌కు చెందిన సిల్వేరు శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. తనకు నమ్మకస్తుడిగా పనిచేసిన శ్రీను మృతిపట్ల ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. అతడి కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.2లక్షల ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. పిల్లల చదువులకు తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు రవీందర్, హన్మనాయక్, బాబ ఉన్నారు.


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

ఫ్యూచర్ సిటీలో కలిపే వరకు ఉద్యమం

మహేశ్వరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మొత్తం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసే వరకు ఉద్యమం ఆగదని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వి.రఘుపతి, ముఖ్య సలహాదారు జంగయ్యయాదవ్ అన్నారు. సోమవారం మహేశ్వరం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది బైక్‌లతో ర్యాలీగా వెళ్లి అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు, ఎయిర్‌పోర్టుకు ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీకి చేరువలో ఉన్న మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలన్నారు. మహేశ్వరం మొత్తం మండలాన్ని ఫ్యూచర్‌సిటిలో విలీనం చేయకుంటే ఉద్యమ కార్యాచరణతో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి యాదగిరిగౌడ్, డి.యాదగిరిరెడ్డి, కె.జగన్‌రెడ్డి, బి.నర్సింహ, పి.సుదర్శన్, దత్తునాయక్, ఈశ్వర్, కె.రమేష్, కె.చంద్రయ్య, టి.యాదీష్, దేశ్యానాయక్, నవీన్, సమీర్, ఎ.యాదయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


వీధులను శుభ్రం చేస్తున్న నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) విష జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పార్టీ పిలుపు మేరకు సోమవారం మేడ్చల్‌లో నాయకులు, కార్యకర్తలు వీధులను శుభ్రం చేశారు. శైలజ మాట్లాడుతూ... సామాజిక కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ పిలుపునిచ్చిందన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా రోజూ పార్టీ తరపున ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ నాయకులు పాతూరి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, అర్జున్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణం, విశ్వక్సేన పూజ, పుణ్యాహ:వచనం, అంకురారోహణం, ధ్వజాపటాధివాసం పూజలు చేశారు. పూజాకార్యక్రమంలో బాల్‌రాజ్‌గుప్తా, పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిశోర్, రాంభూపాల్, నర్సింహులుగుప్తా, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోజుకు భారం రూ.అరకోటి!

(ఐదో పేజీ తరువాయి)

స్వల్ప పెరుగుదల ఉండనుంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద తీసుకునే సిలిండర్లకు ప్రస్తుతం రూ.503 చెల్లిస్తుండగా ఇక రూ.553లు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రతీ నెల ధరలపై కేంద్రం సమీక్ష

ఉమ్మడి జిల్లాలో 31.29 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 14.93 లక్షల కనెక్షన్లు, మేడ్చల్ జిల్లాలో రూ.13.71 లక్షల కనెక్షన్లు, వికారాబాద్ జిల్లాలో 2.65 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి రోజుకు సగటున రూ.1.1లక్షల సిలిండర్లు బుక్ అవుతాయి. ఈ లెక్కన పెరి



గిన గ్యాస్ ధరల వల్ల రోజుకు అర కోటికిపైగా ప్రజలపై భారం పడనుంది. అంటే నెలకు రూ.15 కోట్లపైనే అన్నమాట. ఎల్‌పీజీ ధరలు పెంచిన కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచింది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా లీటర్‌కు రూ.2ల చొప్పున పెరిగాయి. అయితే పెరిగిన మొత్తాన్ని ఆయిల్ కంపెనీలే భరిస్తాయని, ఈ భారం ప్రజలపై ఉండదని కేంద్రం ప్రకటించడం కొంత ఉపశమనం కలిగింది. మరో వైపు ఎల్‌పీజీతోపాటు ఇంధన ధరలను ఇక ప్రతినెలా సమీక్షిస్తామని కేంద్రం ప్రకటించడంతో భవిష్యత్తులో కూడా మరింత ధరలు పెరుగుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం కిందటే హోటళ్లు, రెస్టారెంట్లు అవసరాల కోసం వినియోగించే వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధరను రూ.41 మేర తగ్గించిన కేంద్రం అప్పుడే మరో రూ.50 పెంచడంతో హోటళ్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధరల పెంపు పేదలపై భారమే



గ్యాస్ ధరలు పెంచడం పేదలపై భారం మోపడమే. ప్రభుత్వాలు వాటి స్వార్థం కోసం గ్యాస్ ధరపై డ్రామాలాడుతున్నాయి. మాకు ఇప్పటి వరకు రూ.500కు గ్యాస్ స్కీం రాలేదు. డీలర్లు, డెలివరీ బాయ్‌లు వినియోగదారులను దోచుకుంటున్నారు. పెంచే రూ.50తో డీలర్ల దోపిడీకి అవకాశం మరింత పెరిగింది. ఏజెన్సీలు కొన్ని కిలోమీటర్ల వరకు ఉచితంగా సిలిండర్ల పంపిణీ చేయాలని అధికారులు చెబుతున్నా డీలర్లు డెలివరీ బాయ్స్‌తో రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వానికి ధరల పెంపుపై ఉన్న శ్రద్ధ డీలర్ల దోపిడిపై లేదు.

- విజయలక్ష్మి, గృహిణి, కేశంపేట

టీజీఐఐసీ భూములకు కంచె!

పూర్తి పరిహారమిచ్చి తీసుకోవాలంటున్న రైతులు.. ఇంటి స్థలం ఇవ్వలేదంటున్న నిర్వాసితులు


మేడిపల్లిలో భూమికి కడీలు పాతుతున్న అధికారులు

యాచారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకు కొన్ని రోజులుగా రెవెన్యూ, టీజీ ఐఐసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్ వేయిస్తున్నారు. హద్దులు గుర్తించి ఇనుప కడీలు పాతుతున్నారు. దీంతో రైతులు కలవర పడుతున్నారు. తమకు పూర్తిస్థాయి పరిహారం, ఇళ్ల ప్లాట్ సర్టిఫికెట్లను ఇవ్వకుండానే ఫెన్సింగ్ ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నారు. రెండెకరాలుంటే ఎకరానికే కాంపన్సేషన్ ఇచ్చారని, నిర్వాసితులకు ఇంటి స్థలం సర్టిఫికెట్లు ఇస్తామని ఇవ్వలేదని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు మండిపడుతున్నారు. ఈ గ్రామాల్లో 3,985 మంది రైతుల నుంచి 10,500ఎకరాలకు సేకరించారు. ఇందులో 8వేల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. 2,500 ఎకరాలపై కోర్టుల్లో కేసులున్నాయి. 2,132 మంది రైతులకు ఇళ్ల పట్టాలిచ్చారు. కోర్టు కేసుల్లోని భూములు కలుపుకొని 910 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇంటిస్థలం పట్టాలిచ్చినా పొజిషన్ చూపలేదు. ప్రభుత్వం తీసుకున్న భూములకు కంచె వేస్తే అభ్యంతరం లేదుగానీ.. పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తన నాలుగెకరాలు తీసుకొని ఎకరానికే పరిహారం ఇచ్చారని, ఇంటి స్థలం ఇవ్వలేదని పల్లెచెల్కతండాకు చెందిన బాల్యానాయక్ చెప్పాడు. న్యాయం చేయాలని ఏడున్నరేళ్లుగా అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నాడు.

మాట నిలుపుకోవాలంటున్న రైతులు

తాము ప్రభుత్వంలోకొస్తే భూసేకరణ చేయం అని, నిషేధిత జాబితా నుంచి భూములకు తొలగిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనినే వీరూ కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత పాలకులు భూమి సేకరిస్తే ఇప్పుడున్న పాలకులు ఆ భూములకు ఫెన్సింగ్ వేస్తూ రైతులు తమ పొలాల్లోకి అడుగుపెట్టకుండా చేయడం అన్యాయం అంటున్నారు. ఫార్మాసిటీనే రద్దు చేస్తామన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడా విషయాన్నే ప్రస్తావించడం లేదని, భూ సేకరణను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేసేదాక పోరాడతాం



మాకు ప్రభుత్వం న్యాయం చేసేదాక తాము పోరాటం చేస్తాం. కోర్టు కేసుల్లోని భూములకు ఫెన్సింగ్ వేసేందుకు అధికారులు పూనుకోవడం సరికాదు. నిషేధిత జాబితాలోని భూములను విడుదల చేయాలి. రైతులకు పూర్తిస్థాయి పరిహారం అందించేదాకా భూములకు కంచె వేయడం ఆపేయాలి.

గడ్డం రాములు, రైతు, మేడిపల్లి

ఎకరానికే పరిహారమిచ్చారు



మా తాతల కాలం నుంచి ఈ భూమిలో సాగుచేసుకుంటూ బతుకుతున్నాం. మాకు నాలుగు ఎకరాలుంటే ఎకరం భూమికే డబ్బులిచ్చారు. మిగతా భూమి పరిహారం కోసం కలెక్టర్, ఆర్డీవోల చుట్టూ తిరుగుతున్నా. ఏ అధికారీ న్యాయం చేయలేదు. ఇది అసైన్డ్ భూమే అయినా న్యాయంగా పరిహారం ఇవ్వాలి. లేదంటే భూమి ఖాళీ చేయం.

సక్రీనాయక్, మహిళా రైతు , పల్లెచెల్కతండా

రైతులందరినీ ఆదుకుంటాం



పరిహారం ఇవ్వలేదని రైతులు ఆందోళన చెందొద్దు. అందరినీ ఆదుకుంటాం. భూములు తీసుకున్న రైతులకు 15రోజుల్లో ఇంటి స్థలమిచ్చేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు నాలుగు గ్రామాలకు చెందిన 2,132 మంది రైతులకు ప్లాట్ల సర్టిఫికెట్లిచ్చాం. ప్రభుత్వం వేస్తున్న ఫెన్సింగ్‌ను తొలగిస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయి. ఇది రైతులు గమనించాలి.

అనంతరెడ్డి, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం

మహిళపై అత్యాచారయత్నం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాల పక్కనుంచి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ పై ఓ కామాంధుడు అత్యాచారయత్నం చేశాడు. తనకు తనుగా రక్షించుకోవడానికి ఆ మహిళ బండ రాయితో కామాంధుడిపై దాడి చేసి అక్కడి నుంచి తప్పించుకుని ఊరు వైపు పరుగులు తీసింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి రైలు పట్టాల వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ -గౌడవెల్లి రైలు పట్టాల పక్క నుంచి ఓ మహిళ రాత్రి వేళ గౌడవెల్లి వైపు నడుచుకుంటూ వస్తుండగా ఓ వ్యక్తి ఆమెను అడ్డగించి అత్యాచారం చేసే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ మహిళ అరుపులు కేకలు పెడుతూ బండ రాయితో అతడిపై దాడి చేసి అక్కడి నుంచి తప్పించుకుంది. దీంతో స్టేషన్ మాస్టర్ స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలానికి చేరుకుని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల ఎంఎంటీఎస్‌లో ఓ యువతిపై జరిగిన అత్యాచారం ఘటనతో స్థానికులు కోల్కోక ముందే మరో ఘటన చోటు చేసుకోవటం స్థానికులకు ఆందోళనకు గురి చేసింది.

ఇన్‌కం ట్యాక్స్ అధికారుల తనిఖీ

పూడూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చన్‌గోముల్ గ్రామంలో ఇన్‌కం ట్యాక్స్ అధికారి విఠల్‌రావు బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. గ్రామానికి చెందిన బేగరి ప్రభాకర్ ఇంట్లో వరంగల్‌కు చెందిన పండాల రవళి అనే మహిళ అద్దెకు ఉంటూ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఆమె ఫోర్జరీ సంతకాలు, ఇతర అంశాలపై ఇన్‌కంట్యాక్స్ అధికారులు వారి నుంచి సమాచారం తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి పరశురాం తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న యాదవరెడ్డి

షాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పంటలు చేతికందుతున్న దశలో రైతులకు కలుగుతున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకుంటూ అధికారులు డబ్బులకు ఆశపడి సమస్య పరిష్కరించడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని రైతులు కాళ్లు మొక్కినా కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరిపల్లి సర్వే నంబర్ 47లో స్తంభం విరిగి ఐదు రోజులుగా కరెంట్ సరఫరా లేక పంట ఎండుతోందన్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు తెలియజేస్తే.. వారు పోలీస్ కంప్లైంట్ ఇచ్చి, పని త్వరగా కావాలంటే రూ.15వేలు చెల్లిస్తే ప్రైవేట్ వ్యక్తులతో చేయిస్తామని లైన్ ఇన్‌స్పెక్టర్ అంటున్నాడని తెలిపారు. నాగర్‌కుంటలో లో వోల్టేజీతో బోరు మోటార్లు నడవడం లేదని, దామర్లపల్లిలో బోరు మోటర్ల లైన్లను సరిచేయడం లేదన్నారు. రైతుల పనులు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, చంద్రబాబు, నర్సింహులుగౌడ్, ఆంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.


కూలీలతో మాట్లడుతున్న పెంటయ్య

కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల డబ్బులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య కోరారు. కూలీలకు 8 వారాలుగా డబ్బులు రావడం లేదని తెలిపారు. పడకల్‌లో సోమవారం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెంటయ్య మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు కూలి చెల్లించకుంటే కలెక్టరేట్ కార్యాలయాలన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, కూలీలు పుష్పలత, చెన్నయ్య, శ్రీశైలం, రమేశ్, జంగయ్య, కృష్ణయ్య, అలివేలు పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌కు రోడ్డేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

తాండూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తాండూరులో కాంగ్రెస్ నాయకుడి ఫామ్‌హౌస్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు వేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రూ.60లక్షలతో రోడ్డు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా ఫామ్‌హౌస్‌లకు రోడ్లు వేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, బీసి, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కె. చంద్రయ్య, జిల్లా కార్యదర్శి రత్నం, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి

నందిగామ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నందిగామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నిధులు రూ.2లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నర్సింలు స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు రాములు, సుమన్, బాల్‌రాజ్, శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణ పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే చర్యలు

మర్పల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ మునిరుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో పలుచోట్ల ప్రభుత్వ భూముల్లో రియల్ దందా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటివి తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. పట్లూర్‌లో కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేసి కడీలు పాతడంతో తొలగించి వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూములను కబ్జా చేస్తూ రోడ్లు వేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఫ్లెక్సీ వార్!

- సొసైటీ ఆఫీసులో కేసీఆర్ ఫ్లెక్సీని చించేసిన కాంగ్రెస్ నాయకులు
- ప్రతిగా సీఎం ఫొటోను నేలకేసి కొట్టిన ప్యాక్స్ చైర్మన్

శామీర్‌పేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని సొసైటీ కార్యాలయంలో ఎందుకుంచారని కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీని చింపేశారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం శామీర్‌పేట ప్యాక్స్ కార్యాలయంలో జరిగింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, మరో 20 మంది పార్టీ కార్యకర్తలు రైతు సహకార సంఘం కార్యాలయంలోకి వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉండగా మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీలను ఇంకా ఎందుకు ఉంచారని ఆగ్రహిస్తూ గోడలకున్న ఫ్లెక్సీలను కిందపడేసి వెళ్లిపోయారు. నిబంధనల మేరకు మాజీ సీఎం ఫ్లెక్సీలు ప్రభుత్వ కార్యాలయంలో ఉండకూదనాన్నరు. ఆ సమయంలో సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్య, సీఈవో నర్సింహులు, సిబ్బంది ఉన్నారు.

సీఎం ఫొటోను నేలకేసి కొట్టిన చైర్మన్

కాగా కేసీఆర్ చిత్రపటాన్ని తొలగించిన విషయం తెలుసుకున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి రెండు గంటల తరువాత కార్యాలయానికి వచ్చారు. ఆగ్రహంతో ఆయన కార్యాలయంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను నేలకేసి పగులగొట్టాడు. తన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా, మాజీ సీఎం ఫ్లెక్సీని ఎలా తొలగిస్తారని ఆయన అన్నారు. నిబంధనల మేరకు ప్రస్తుత సీఎం ఫొటోను పెట్టాం కదా అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అరచాకాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేశారు.


కార్యాలయంలో చింపేసిన కేసీఆర్ ఫ్లెక్సీని చూపుతున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి, డైరెక్టర్లు


ఫౌండేషన్ సభ్యులతో మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి

'జీవనది' సేవలు అభినందనీయం

కేశంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నదుల సంరక్షణ కోసం జీవనది ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పుష్కర నదుల పురస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విశాల హాజరై మాట్లాడారు. జీవనది ఫౌండేషన్ నదులు కలుషితం కాకుండా తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అన్నారు. నదుల్లో ప్లాస్టిక్, వాటర్ బాటిళ్లలను తొలిగించేందుకు చేస్తున్న కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నీటి సంరక్షణకు కృషిచేస్తున్న ఫౌండేషన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇంటి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు



- అనంతరెడ్డి, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం

ఫేస్ టూ ఫేస్

యాచారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూసేకరణ అంశంపై త్వరలో విచారణ చేసి అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు జిల్లా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారని, ఫార్మాసిటీ భూసేకరణపై భూమి లేకుండా పరిహారం కింద డబ్బులు డ్రా చేసుకున్న వారిపై ప్రభుత్వం విచారణ చేసి దోషులపై తగిన చర్యలు తీసుకుంటుందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: ఫార్మాసిటీ కొరకు యాచారం మండలంలో ఇంతవరకు ఎన్ని ఎకరాల భూములు సేకరించారు?

జవాబు: మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో అసైన్డ్ భూములు 4వేల ఎకరాలు, పట్టాభూములు మరో 4వేల ఎకరాలు సేకరించాం.

ప్రశ్న: ఫ్యూచర్‌సిటీ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టారా?

జవాబు: గతంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో నుంచే ఫ్యూచర్‌సిటీ కొరకు రోడ్డు వేయనున్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ప్రశ్న: ఫార్మాసిటీ భూసేకరణలో అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శలున్నాయి. నిజమేనా?

జవాబు: ఫార్మాసిటీ భూసేకరణలో అవినీతిపై త్వరలో ఉన్నతాధికారులు విచారణ చేయడానికి సిద్ధమవుతున్నారు. అక్రమార్కులపై చర్యలుంటాయి.

ప్రశ్న: మండలానికి చెందనివారు.. సెంటు భూమి లేనివారు వారి పేరిట డబ్బు డ్రా చేసుకున్నట్లు విమర్శలున్నాయి. వాస్తవమేనా?

జవాబు: విచారణ చేసి సెంటు భూమి లేనివారు డబ్బు ఎలా డ్రా చేశారో విచారణ చేసి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: డివిజన్‌లో ఎన్ని భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారు?

జవాబు : డివిజన్‌లోని ఆర్డీవో పరిధిలో 1,200, తహసీల్దార్ల పరిధిలో 1,300 భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇంటిస్థలాల సర్టిఫికెట్లను ఎప్పుడు అందిస్తారు?

జవాబు : భూములిచ్చిన రైతులందరికీ ఇంటిస్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లను అందించడానికి కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీరాఘవేంద్ర హోటల్‌లో తనిఖీలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ డాక్ బంగ్లా పక్కన ఉన్న శ్రీ రాఘవేంద్ర హోటల్‌లో ఈనెల 4న ఆనియన్ దోశలో బొద్దింక రావడంపై జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి ఉదయ్ కిరణ్ సోమవారం హోటల్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆహార పదార్థాలను పరిశీలించి నమూనాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన సరుకులనే వాడాలని, లేదంటే తగిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

నిరుపయోగంగా వసతి గృహం

- విద్యార్థులు చేరకపోవడంతో ఖాళీగా హాస్టల్
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కేశంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో విద్యార్థులు చేరకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు కూడా గాలికి వదిలేశారు. పట్టించుకునే వారు లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండల కేంద్రంలో దాదాపు 25 సంవత్సరాల క్రితం బీసీ వసతి గృహాన్ని నిర్మించారు. అప్పట్లో విద్యార్థులతో హాస్టల్ కళకళలాడుతుండేది. గురుకుల విద్యాలాయాలు రావడంతో వసతి



నిరుపయోగంగా ఉన్న బీసీ వసతి గృహం

గృహంలో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. కాగా, 2020లో కొవిడ్ సంక్షభంలో విద్యాలయాలు, హాస్టళ్లు మూతబడ్డాయి. ఈక్రమంలో హాస్టళ్లలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని చెప్పవచ్చు. విద్యార్థులు అందులో ఉండటానికి ముందుకు రాకపోవడంతో కేశంపేట బీసీ హాస్టల్‌ను ప్రీమెట్రిక్ హాస్టల్‌గా మార్చి షాద్‌నగర్‌కు తరలించారు. ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ ఉపయోగపడుతోంది. అయితే కేశంపేటలో నిర్మించిన వసతి గృహాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వసతి గృహన్ని శుభ్రం చేసేవారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. అధికారులు స్పందించి వసతిగృహాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యావేత్తలు కోరుతున్నారు.

భవనాన్ని వినియోగంలోకి తేవాలి



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. బీసీ వసతి గృహానికి దాదాపు రెండెకరాల స్థలం ఉంది. యువత, విద్యార్థులకు ఉపయోగపడేలా భవనాన్ని తక్షణమే అందుబాటులోకి తేవాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సంతోష్‌కుమార్ గుప్తా, కేశంపేట

పట్టించుకునే వారేలేరు



కేశంపేట బీసీ వసతి గృహాన్ని పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మధ్యాహ్న సమయంలో చిరు వ్యాపారులు అక్కడే భోజనం చేస్తూ.. మద్యపానం సేవిస్తున్నారు. భవనానికి గేట్లు లేక పోవడంతో ఎవరుపడితే వారు హాస్టల్‌లోకి వెళ్తున్నారు. అధికారులు భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

- సాజిద్, సంతాపూర్, కేశంపేట మండలం

మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

మహేశ్వరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన పదకొండు సంవత్సరాలుగా ప్రజస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగానే కొనసాగుతోందని, సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయమని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తల పెట్టిన జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గొల్లూరు. నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై అమిత్‌షా, పలువురు బీజేపీ నేతలు చేస్తున్న అంతర్గత దాడితో దేశాన్ని ముక్కలు చేస్తున్న బీజేపీ తీరుపై కాంగ్రెస్ అధినాయకత్వం దేశవ్యాప్తంగా ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న నిజాన్ని మరిచిపోతుందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. అంబేడ్కర్ ను అవమానిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ అనితా రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాద య్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గం అధ్యక్షుడు నడికూడ శివ, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు. మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం పునాది వేస్తోందని ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డిలు అన్నారు. సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం మండల ఇన్‌చార్జి పెంటారెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు మండలంలోని గుమ్మడవెల్లి, మాదాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఎస్.వెంకటేష్‌గౌడ్, అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, సరికొండ జగన్, డిల్లీ శ్రీధర్, ఎస్టీ అజీజ్, ఎండీ సులేమాన్, అండేకార్ సురేందర్, గాదె కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : గొల్లూరు గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి



కందుకూరు : గుమ్మడవెల్లిలో అంబేడ్కర్, విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణానాయక్, బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి

క్రైం కార్నర్

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆదిభట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి రెడ్డి కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని కట్నీకి చెందిన కైలాష్ గుప్తా(42) మన్నెగూడలోని ఓ ప్రైవేటు గేదెల డెయిరీ ఫారంలో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం పనులు ముగించుకొని మన్నెగూడ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మన్నెగూడ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం కైలాష్‌ను ఢీకొట్టింది. దాంతో అయనకు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో 108లో ఉస్మానియాకు తరలించారు. వైద్యులు కైలాష్ అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

ఆదిభట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక భార్య పోలీస్‌లకు ఫిర్యాదు చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ మన్నెగూడకు చెందిన మర్రి నరేందర్‌రెడ్డి ప్రియాంక దంపతులు అత్తమామలతో కలిసి మన్నెగూడలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అయితే, కొంతకాలంగా ప్రియాంకను భర్త నరేందర్‌రెడ్డి, అత్త మామలు వేధిస్తున్నారు. నరేందర్‌రెడ్డి భార్యను కాదని మరొక స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకొని ప్రియాంకను దూరంగా ఉంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ వేధిస్తున్నట్లు బాధితురాలు తెలిపారు. భర్త, అత్తామామల వేధింపులు భరించలేక ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. నరేందర్‌రెడ్డి తన భార్యాపిల్లలను ఇంటికి రానివ్వకుండా ఇంటికి, గేట్‌కు తాళాలు వేసి బయటకు వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న ప్రియాంక పిల్లలు, బంధువులతో కలిసి సోమవారం ఇంటికెళ్లి తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లింది. ఈమేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

కేశంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు సీఐ నరహరి తెలిపారు. ఆయన కథనం మేరకు కొత్తపేటకు చెందిన రొయ్యల రాకేశ్(21) గ్రామంలోని లక్ష్మి మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గత శనివారం మెడికల్ షాపుకు వెళ్లి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లాడు. అనంతరం తాను మెడికల్ షాపుకు వెళ్తున్నానని తల్లి యాదమ్మకు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆమె ఫోన్‌కు చేసింది. ఒక రింగ్ వచ్చి, ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈమేరకు రాకేశ్ తెల్లని రంగుతో గుండ్రని ముఖం కలిగి ఉంటాడని, ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో గ్రీన్ కలర్ టీషర్టు, గోధుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని యాదమ్మ తెలిపింది. ఆదివారం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా సమాచారం దొరకలేదు. దాంతో సోమవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు అండ : ఎమ్మెల్యే



చెక్కు అందిస్తున్న ప్రకాశ్‌గౌడ్, పక్కన మాజీ సర్పంచ్ ఇస్తారి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఈమేరకు సోమవారం శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి గ్రామానికి చెందిన ఎల్కచర్ల వెంకటరెడ్డికి ఎమ్మెల్యే సహకారంతో రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించారు. దాంతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆయన నివాసంలో లబ్ధి దారుడికి చెక్కును అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్, రాజు గౌడ్, రాజు, సిద్దిఖ్, శివగౌడ్, దండు శివ, కావలి ఈశ్వర్, అరుణ్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా స్థలాన్ని కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహేశ్వరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమీర్‌పేట గ్రామంలో కబ్జాకు గురైన ఐదు గుంటల ఈద్గా స్థలాన్ని కాపాడాలని మహేశ్వరం మండల ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు హాజీబాబా అన్నారు. ఈమేరకు ఈద్గా స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సైదులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అమీర్‌పేట గ్రామంలో సర్వే నెంబర్ 291/ఓలో ఈద్గాకు 5 గుంటల భూమి ఉందని, అది కబ్జాకు గురవుతోందన్నారు. భూమి కబ్జా కాకుండా సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని కోరారు. ముస్లిం నాయకులు యూసుఫ్, అలీ, హబీబుద్దీన్, హమీద్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి రథయాత్ర'ను జయప్రదం చేయాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ విశారదన్ మహరాజ్ ఏప్రిల్ 14 నుంచి చేపట్టనున్న మా భూమి రథయాత్ర సభను విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు డప్పు రవీందర్ కోరారు. ఈమేరకు కొందుర్గు మండల పరిధి ఉత్తరాస్‌పల్లి, మహదేవ్‌పూర్, రాంచంద్రపూర్‌లో తిరిగి ఒక లక్ష కిలోమీటర్ల సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. పెంటయ్య, రాములు, సాయిచరణ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ

కందుకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడ గ్రామ శ్రీరామనవమి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాలు కొనసాగనున్న ఈ కమిటీ అధ్యక్షుడిగా బొక్క బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొక్క సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సొడపు శేఖర్‌గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శులుగా తల్లోజు చంద్రశేఖరచారి, కోశాధికారిగా పుల్లగూర్ల తిరుపతి రెడ్డి, సలహాదారులుగా ఆర్.యాదయ్య, బి.లోకేశ్వర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, కుమ్మరి లక్ష్మయ్య, పిట్టల యాదయ్య, బొక్క హన్మంత్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాల్‌రెడ్డి తెలిపారు. అనంతరం మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నూతన చైర్మన్ బాల్‌రెడ్డిలను మాజీ సర్పంచ్ మల్లారెడ్డి ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లికి చెందిన గోవిందు మంజులకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.14,500 మంజూరయ్యాయి. సోమవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు తలకొండపల్లి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్యలు చెక్కును అందజేశారు. రాజు, జంగయ్య, కృష్ణయ్య, రవీందర్, అశోక్‌గౌడ్, వెంకటేశ్, నర్సింహ, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు కాంగ్రెస్ నేతల పరామర్శ



ఆమనగల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను సోమవారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్ నాయక్‌లు పరామర్శించారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విశ్రాంతి తీసుకుంటున్న వంశీకృష్ణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ఆమనగల్లు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ పోతూలూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం విశ్వకర్మ చేతివృత్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ హాజరయ్యారు. విశ్వకర్మ చేతి వృత్తుల సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణాచారి, మండల బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు వాణిశ్రీ, నాయకులున్నారు.



ఆమనగల్లు : వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణంలో భక్తులు

శ్రీ రాధాకృష్ణ వార్షిక బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బాలాజీ నగర్ సమీపంలోని ధనరాశి కొండపై గల శ్రీ రాధాకృష్ణ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. తొలిరోజు స్వామి వారికి అభిషేకం, విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యహవాచనం, రుత్విక్‌కరణం, అంకురారోహణం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులుస్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నేడు నిర్వహించే రాధాకృష్ణుల కల్యాణానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా స్వయంవరం నాటిక

షాబాద్ : స్వాధ్యాయి పరివార్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని ముద్దెంగూడ, బొబ్బిలిగామ, మాచన్‌పల్లి, తదితర గ్రామాల్లో శ్రీరాముని చిత్రపటంతో, ఆట పాటలతో యువతీ యువకులు, మహిళలు శోభాయాత్ర నిర్వహించి పెద్దఎత్తున కార్యక్రమాన్ని వైభవంగా జరుపుకున్నారు. సీతాదేవికి స్వయంవరం నాటికను చిన్నారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. స్వాధ్యాయిపరివారం ద్వారా పరమపూజ్యనీయ పాండురంగశాస్త్రి అథవాలే (దాదాజీ), దీదీ పంపించిన చింతనిక వివరించారు.

ప్రతీ సోమవారం అన్నప్రసాదం

షాద్‌నగర్ అర్బన్: పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో ప్రతీ సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కల్పవృక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల కుమారస్వామి తెలిపారు. సోమవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి నందీశ్వర్ ప్రారంభించారు.

నల్లవెల్లిలో భక్తులకు అన్నదానం

యాచారం : మండలంలోని నల్లవెల్లిలో గల శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాదులు చేశారు. యాచారం, మర్రిగూడ, చింతపల్లి మండలాల నుంచి భక్తులు ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.

'ఫ్యూచర్'లో మహేశ్వరం!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు మండలాన్ని మొత్తం ఫ్యూచర్ సిటీలో కలిపే దిశగా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. మండలం మొత్తాన్ని విలీనం చేస్తే లాభం ఎంత ఉంటుందో, నష్టం కూడా అదే తరహాలో ఉండొచ్చని మంత్రి చెప్పిన మాటలు అయోమయానికి గురి చేస్తున్నాయి. అయితే ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కాదు కదా కనీసం మున్సిపాలిటీకి కూడా ఒప్పుకోవడం లేదు. గ్రామ పంచాయతీలుగా ఉంటేనే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అగ్రనాయకుల ప్రకటనలతో పరేషాన్..

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కొందరు అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తున్నారు. అదే సమయంలో జూన్, జూలైలో స్థానిక ఎన్నికలు జరగొచ్చని కొందరు ప్రభుత్వ పెద్దలు తాజాగా చేసిన ప్రకటన మరింత అయోమయానికి గురిచేసింది. అంతేగాక ఆరు నెలల క్రితం కేఎల్లార్ ప్రకటించిన విధంగా మున్సిపాలిటిగా ఏర్పాటు చేస్తారా అనే ప్రశ్నకు సైతం సమాధానం దొరకడం లేదు. దీంతో అసలు ఏం జరుగుతుందో ఊహించకలేక రాజకీయంగా తలపండిన నేతల్లోనూ టెన్షన్ మొదలైంది. ఇన్ని రోజులు పార్టీ కోసం పని చేసి పంచాయతీ ఎన్నికలు జరగకపోతే తమ రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందని ఆయా పార్టీలకు చెందిన కొందరు నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలను కలుపుకొని ఫోర్త్ సిటీ కార్పొరేషన్‌గా చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న కేఎల్లార్ చేసిన ప్రకటనకు తోడుగా ఫ్యూచర్ సిటీ జేఏసీ పేరుతో ఆయా పార్టీల నాయకులు చేస్తున్న ఉద్యమం కార్యరూపం దాలుస్తుందా లేదా వేచి చూడాలి.

'మన ఆలోచన సాధన సమితి' పోస్టర్ ఆవిష్కరణ



షాద్‌నగర్ అర్బన్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్/నందిగామ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీసీల సాధికారత సాధనే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి ఆవిర్భవించబోతున్నదని సమితి షాద్‌నగర్ కన్వీనర్ గోర మల్లేష్‌గౌడ్ తెలిపారు. మన ఆలోచన సాధన సమితి పోస్టర్‌ను సోమవారం షాద్‌నగర్‌లో ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 15న కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మన ఆలోచన సాధన సమితి ఆవిర్భవించబడుతుందని తెలిపారు. సన్నాహక కమిటీ సభ్యులు కొండ సత్తయ్యగౌడ్, పతంగి విఠలయ్యగౌడ్, లక్ష్మణ్, ఆర్.పవన్‌కుమార్, ఎ.రాంచంద్రయ్య, ఆర్.రమేష్‌యాదవ్, తదితరులున్నారు. నందిగామ మండలకేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రతినిధులు విఠలయ్యగౌడ్, పవన్ కుమార్‌గౌడ్, లక్ష్మణ్, ప్రకాశ్, అర్గె రమేష్‌యాదవ్, బీసీ నాయకులు కేశమోని శ్రీనివాస్‌యాదవ్, శ్రీను ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు వేలం

మాడ్గుల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారెడ్డిపల్లి సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమి 25 ఎకరాలకు సంబంధించి కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించారు. ఆలయ చైర్మన్ గౌరవరం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం గ్రామ సభ వేర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నాగిళ్ళ బాలయ్య రూ.4లక్షలకు భూమిని కౌలు కింద దక్కించుకున్నాడు. మాజీ ఎంపీపీ గౌరవరం పద్మ, మాజీ సర్పంచ్ పల్లేటి యాదయ్య, పల్లేటి పద్మ, యాదయ్య, తోట చంద్రయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

నక్షబాటలకు అడ్డుగా ముళ్లకంప.. కడీలు

- నిందితులపై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

చౌదరిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నక్షబాటలకు ముళ్లకంప, కడీలు వేసి గ్రామంలోని దారిని బంద్ చేసిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని టేకులపల్లిలో చోటుచేసుకుంది. సోమవారం కొందుర్గు ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. టేకులపల్లికి చెందిన బ్యాగరి రాజు, బ్యాగరి మహేష్, బ్యాగరి పాండు, బ్యాగరి ప్రవీణ్‌లు టేకులపల్లి నుంచి బయటికి వెళ్లే అన్ని దారుల్లోని నక్షబాటలకు ముళ్లకంప, కడీలు వేసి అందరినీ గ్రామంలోనే నిర్బంధించారు. గ్రామానికి చెందిన కొందూటి జంగయ్య పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కార్యదర్శి మల్లేష్ టేకులపల్లికి వచ్చి తహసీల్దార్ రమేష్‌కుమార్‌తో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. నక్షబాటలకు ఉద్దేశ్యపూర్వకంగా ముళ్ల కంప, కడీలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ సబ్సిడీ రుణాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సోమవారం గిరిజన సంఘాల ఛలో గిరిజన సంక్షేమ భవన్‌కు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌కు గిరిజన నేతలు తరలకుండా కట్టడి చేశారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్‌ను కడ్తాల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు.

కడ్తాల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.కొండారెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీసెల్ కో-ఆర్డినేటర్ గణేశ్ రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబా, నాయకులు యూసుఫ్‌బాబా, భాస్కర్ తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని సంగాయిపల్లిలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుకు సాయం చేయాలని ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్‌తో పాటు గ్రామంలోని యువకులు, నాయకులు.. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌ను కోరారు. స్పందించిన ఆయన రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు నాగరాజు గౌడ్, సురేశ్, పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన రేణుక మృతిచెందింది. సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీటీసీ పాలకుర్ల రాములు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయ అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు అంజయ్య, నర్సింహ, సత్తయ్య, చంద్రయ్య, మహేందర్, మహేశ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల కాంగ్రెస్ నాయకులు సోమవారం జూపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోగా వాటి పరిష్కానికి కృషి చేస్తానని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ ఎలా ఉందని ఆరా తీసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం చెరువుకట్టపై మైసమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు పూజలు చేశారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు జెర్కోని రాజు, ఏనుగు భరత్‌రెడ్డి, శివసాయి, కొండ్రు ప్రవీణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు